# మార్పు

కె.వి.ఎస్.వర్మ

గోదావరి గట్టు పక్క రోడ్డు మీద వెళ్తున్న వాళ్లు గబుక్కునాంగి, రోడ్ కమ్ రైలు బ్రిడ్జి మీదకు చూశారు. రైలు కనిపించలేదు. వెనక్కి తిరిగి పాత రైలు బ్రిడ్జి వంక చూశారు.

దాని మీదా రైలు లేదు!

'మరి ఏమిటీ శబ్దం' అనుకుంటూ గోదావరి గట్టు చప్టా వైపు చూశారు. అక్కడ ఏడెనిమిదిమంది బఠానీల పొట్లు ఊదుతూ, బఠానీలు తిండం కనిపించింది.

అదా సంగతీ అనుకుంటూ రోడ్డు మీదాగిన వాళ్లు ముందుకెళ్లిపోయారు.

బఠానీలన్నీ అయిపోయాక మిత్రులందరూ ఒకరినొకరు చూసుకున్నారు.

" ఈ మధ్య చిల్లర తిండి ధ్యాస ఎక్కువై పోయింది గురూ " అన్నాడు జగదీష్.

"...ండి కలిగితే కండ గలదోయ్, కం...లవాడేను మనిషోయ్ " అంటూ ఎత్తుకున్నాడు కొటేషన్‌రావు.

అంతా వింటూ గోదావరి వంక చూస్తూ వుండి పోయారు.

గోదావరి కూడా ఆ పాట వినడానికన్నట్టు మౌనంగా నిలకడగా వుంది.

పాటయ్యాక "ఇవాళ మన కథల్రాజు ఇంకా రాలేదు" అన్నాడు కవికుమారుడు.

" వూరెల్లాడేమో. కథల్రాజు వుంటే గానీ నీకు మాటల్లో స్పీడు రాదు " అన్నాడు శాస్త్రి.

అంతలో కథల్రాజు వచ్చాడు.

" నూరేళ్లాయుష్షు. ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాం"

" హాపీ చిరాయువు అని. నాకంత వద్దులే " అన్నాడు కథల్రాజు కూర్చుంటూ.

" ఏంటి బాసూ, ఇంతాలస్యం "

" కొత్త బట్ట లేశావ్. ఏంటి సంగతి " అంటూ నాయుడూ, వాసూ అడిగారు.

" ఇవేళే మేం జన్మించాం బ్రదర్ "

" అయితే, ఒంటి మీద బట్టలుండకూడదే "

" నువ్వన్నది నిజమే. అయితే, నాకు జనం మీద చాలా ప్రేమ " అన్నాడు కథల్రాజు.


కొందరు నవ్వేశారు.

కథల్రాజు అందరికీ చాక్‌లెట్లు ఇచ్చాడు.

" హేపీ బర్త్ డే " అన్నారు చాక్‌లెట్లు నోట్లో వేసుకుంటూ.

" ఇవేళేమన్నా కొత్త నిర్ణయం తీసుకున్నావేంటి మిత్రమా ? "

" పాత నిర్ణయాలు మార్చుకోకూడదని కొత్తగా నిర్ణయానికొచ్చాను "




" బావుంది "

" ఏంటీ "

" నీ నిర్ణయం "

" మరి కొత్త బట్టలు గత పుట్టిన రోజు నాడు వేసుకున్నట్టు లేదు "

" అవును. మందుంటే చాలు అనుకునే రోజులు కదా అవి"

" మరిప్పుడో "

" డబ్బెలా ఖర్చు చేయాలా అని ఆలోచించాల్సి వస్తోంది. నేను సిగరెట్లు కూడా కాల్చనేమో, ఖర్చే వుండటం లేదనుకో ఈ మధ్య "

" మంచిదే కదా. మీ ఆవిడ చీరలూ, నగలూ అని పోరుపెడుతుందనేవాడివి కదా "

" అది అప్పటి మాట. నాలుగు రోజులకోసారి చీర కొంటాననేది. మొన్నే కదా కొన్నావ్ అంటే, ఎక్కడలేని డబ్బూ తాగుడికి వస్తుంది. చీరలకు మాత్రం వుండదు అని దెప్పేది "

" మా ఆవిడే అంతే గురూ. అస్తమానూ సినిమాలనేది. డబ్బు వేస్ట్ చెయ్యకంటే , మందుకు మాత్రం వేస్టు చెయ్యొచ్చు అనేది కోపంగా"

" చచ్చినట్టు అప్పో సప్పో చేసి చీర కొనుక్కోమని ఇచ్చేవాణ్ని"

" నేనూ అంతే " అన్నాడు శాస్త్రి.

" ఈ మధ్య చీరలు కొనడానికి వెనకాడుతోంది మా ఆవిడ "

" మా ఆవిడా సినిమాల ఊసు ఎత్తడం లేదు "

" ఎందుకంటారు గురువు గారూ " అన్నాడు వాసు ఆసక్తిగా.

" పెళ్లీ పెటాకులు లేని కుంకా! నీకు తెలియదులే " అన్నాడు శాస్త్రి.

వాసు ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

" తెలుసుకుంటే తప్పేం లేదులే. మొన్నటిదాకా మళ్లీ వృధా ఖర్చు గురించి ఏమన్నా అంటే ,మా మందు వృధా కనిపించేది. దాంతో దెప్పడానికి వీలుండేది. ఇప్పుడా అవకాశం లేదు " అన్నాడు కథల్రాజు అరటి పండు వలిచి వాసు నోట్లో పెడుతూ.

" అంతే కాదు, మా యింట్లో నేనంటే మా వాళ్లకు భయం, భక్తీ పెరిగాయి" అన్నాడు నాయుడు.

" మా యింట్లో కూడా " అన్నాడు శాస్త్రీ, కథల్రాజూ ఒకే సారి.

" మరి ఖర్చు లేదంటున్నారుగా . డబ్బంతా ఏం చేస్తున్నారు " అడిగాడు వాసు ఎవరు అరటి పండు వలిచి నోట్లో పెడతారా అని చూస్తూ .

" పాత అప్పులు తీరుస్తున్నా "

" కొత్త అప్పులు చేయడం లేదు "

అన్నారు కథల్రాజూ, శాస్త్రీ చెరో అరటి పండూ వలుస్తూ .

వాసు ఎందుకయినా మంచిదని వినయంగా ముందుకు వంగాడు.

" ఎంతలో ఎంత మార్పు " అన్నాడు జగదీష్ .

అంతలో గౌతమి ఎక్స్‌ప్రెస్ బ్రిడ్జి మీద కొచ్చింది.

" ఇక ఇళ్ల కెళ్దాం" అంటూ లేచాడు నాయుడు.

అంతా లేచి బట్టలు దులుపుకున్నారు.

కొటేషన్‌రావు చిన్నగా నకిలించి, పెద్దగా అన్నాడు

" అంతా మన మంచికే "

( వచ్చేవారం ః పగలూ రాత్రీ )

---

## పాఠక దర'హాసం'

* "ఒరేయ్ నువ్వు కళ్ల డాక్టర్‌వవుతావా? పళ్ల డాక్టర్‌వవుతావా?" అడిగాడు రాము శ్రీనును.

"పళ్ల డాక్టర్నే అవుతా. కళ్లయితే రెండే ఉంటాయి మనిషికి. అదే పళ్లయితే ముప్పయిరెండుంటాయి కదా." గొప్పగా చెప్పాడు శ్రీను.

* "డాక్టరు గారూ! మీరెంతో మంది రోగుల బాధలు తొలగించారు. ఎంతో చక్కగా రోగిని పరిశీలించి ఖచ్చితంగా రోగ నిర్ధారణ చేయడమేగాక సరైన మందులుకూడా రాసివ్వగలుగుతున్నారు. అసలు మీరేం చదివారు?"

అడిగాడు ఓ పేషెంటు.

"నేనేం ఎక్కువ చదువుకోలేదు. ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో చాలాకాలంపాటు రోగిగా వున్నాను. అంతే!" చెప్పాడు డాక్టరుగారు.

* " మీ ఇంట్లో గడియారం లేదుగా...టైమెలా తెలుస్తుంది?" ఇంటికొచ్చిన స్నేహితురాలు సుగుణ రమని అడిగింది.

" ఓ అదా!..." అంటూ రమ ఏదో చెప్పబోయింది. ఇంతలో-

"ఏవమ్మా..ఇంకా పడుకోలేదా? రాత్రి పన్నెండయింది.." అంటూ కేకలేసింది.

* "నువ్వేం చేశావో తెలుసా! నాలుగు వందల ఏళ్ల నాటి గాజు పాత్రని ముక్కలు చేసేశావ్!" కోపంగా అన్నాడు యజమాని నౌకర్ని.

"బలేవారే! ఏదో కొత్త వస్తువు పగిలిపోయినట్లు బాధపడిపోతున్నారే?!" చెప్పాడు నౌకరు.

* "మరేం ఫర్వాలేదు. అది చచ్చిన నల్లి కదా! ఇప్పుడు హాయిగా పడుకోండి." అర్ధరాత్రి ఫిర్యాదు చేసిన కస్టమరుకు సర్ది చెప్పి పంపేశాడు లాడ్జింగ్ యజమాని.

మరో అరగంట గడిచాక, అదే కస్టమరునుంచి ఫోన్ వచ్చింది.

"అయ్యా! చచ్చిన నల్లి గురించి నేనేం బాధపడంలేదు. ఇప్పుడు దాని శవయాత్రకై విచ్చేసిన దాని వేలాది సోదరులను చూస్తుంటే నా గుండె దడగా వుంది. వెంటనే మీరు వచ్చి నన్ను రక్షించండి!"

* " ఏమయ్యా కండక్టరూ! ఒంగోలు రాగానే నన్ను నిద్రలేపమని చెబితే లేపలేదేం?!" కోపంగా అడిగాడు బస్సు ప్రయాణీకుడు.

"అరే! ఒంగోలులో నిద్రలేపమంది మీరా? నేను నిద్ర మబ్బులో గేటు పక్కనున్నాయణ్ణి బలవంతంగా ఒంగోలులో దింపేస్తుంటే అతను ఎందుకలా దిగనని గింజుకున్నాడో ఇప్పుడర్థమైంది..." చెప్పాడు తాపీగా కండక్టరు.

--కె.నాగేశ్వరరావు,విజయవాడ

* భార్య: ఏమండీ! బాధ కలుగకుండా చనిపోయే మార్గం ఏదైనా వుంటే చెప్పండి.

భర్త:( సంబరపడిపోతూ) ఎందుకు?!

భార్య: మీరు బాధపడుతూ చనిపోవడం నే చూల్లేనండీ!!

-బేరి మధుసూదన్‌ప్రిన్స్,
గడివేముల